
# వీరబాహుడు

## వి. రామలక్ష్మి



అలారం మోగుతోంది. రమణమ్మకి మెలకువ వచ్చింది. లేచి అలారం ఆపుచేసింది. వచ్చి మళ్ళీ మంచం మీద పడుకుంది. అలికిడికి కొంచెం కదిలాడు వెంకటేశ్వర్రావు. భర్తకి దగ్గరగా జరిగింది రమణమ్మ. దుప్పట్లోకి ఆమెనులాక్కున్నాడు అతను. పది నిముషాలు గడిచాయి. రమణమ్మ లేవబోయింది.

"పడుకో రమణా! లేవచ్చులే!" నిద్రమత్తులోనే అన్నాడు వెంకటేశ్వర్రావు.

"టైమయి పోతుందండీ! ఇవాళ పెందరాళే తెమలాలి." అంటూనే మంచందిగి బట్టలు సవరించుకుని గది తలుపు తీసి వంటింట్లోకి వచ్చింది.

నవంబరు నెల చలి. ఐదింటికి అలారం పెట్టుకుని బద్ధకించి ఐదున్నరకి లేచింది. పరుగులు పెడితేగాని పని తెమలదు. రమణమ్మ హడావుడిగా పనిలో జొరబడింది.

::::::::::

"అమ్మా! ఇవాళ ఏంటి స్పెషల్ మీ పెళ్ళి రోజుకి?" బాక్సు బేగ్‌లో వేసుకుంటూ అన్నాడు అరుణ్.

"ఇవాళ స్పెషల్ నేనూ, అమ్మా బయటికి వెళ్ళినప్పుడు తెస్తాంరా! ఇంట్లో ఏం చేయదు అమ్మ!" గదిలోంచి బయటికి వస్తూ అన్నాడు వెంకటేశ్వరావు.

"విష్‌యు హేపీ మారేజ్‌డే డాడీ!" జడ అల్లుకుంటూ వచ్చింది రమ. "థేంక్‌యూ! బేబీ! మీ ఇద్దరూ స్కూలుకు వెళ్ళండి. మీరెళ్ళాక నేనూ, అమ్మా బయటకు వెళతాం. తిరిగి మీరు స్కూలు నుంచి వచ్చే టైముకి వచ్చేస్తాం!" ఆపులిస్తూ అన్నాడు వెంకటేశ్వర్రావు.

"ఈ సంవత్సరం కొత్తగా గడుపుతారా డాడీ! ఐలైక్‌యు డాడీ! ఛేంజ్ ఉండాలి లైఫ్‌లో! బై డాడీ! మమ్మీ! వెళ్ళొస్తాను."

ఇద్దరికీ బై చెబుతూ స్కూలు బేగ్‌తో బయలుదేరింది రమ. అక్కని అనుసరించాడు అరుణ్.

"టెన్త్ చదువుతోందో లేదో దీని మాటలు చూడండి పెద్దాళ్ళలా!" ఫిర్యాదీ ధోరణిలో అంది రమణమ్మ.

"దాన్నంటున్నావు నువ్వు! వేలెడులేదు, అరుణ్‌గాడు చూడు. ఇంతోటి వాడి ఎయిత్ క్లాస్ చదువుకీ తనకేదో అన్నీ తెలుసునన్నట్టు మాట్లాడతాడు!"

వరండాలోంచి లోపలి కొచ్చారు ఇద్దరూ. తలుపు మూయగానే రమణమ్మని కౌగిలిలోకి తీసుకున్నాడు వెంకటేశ్వర్రావు.

"ఏంటండీ! ఇది! పెళ్ళయి పదహారేళ్ళయినా ఇంకా చిన్నపిల్లల్లా!" సిగ్గుపడుతూ విడిపించుకోబోయింది.

"రమణా! నువ్వు నాసర్వస్వంరా! నేనేం అన్నా కాదనవు కదా! నోరు తెరిచి ఏదీ అడగవు కదా! ఈ రోజుల్లో నీలాంటి భార్య దొరకడం నా అదృష్టంరా!!

"మీరు మాత్రం! నన్నెంత ప్రేమగా చూసుకుంటారు. ఏమండీ ఇవాళ ఎప్పట్లా కాకుండా వేరే స్పెషల్‌గా గడపాలి మన పెళ్ళిరోజు!"

"అందుకే కదోయ్ ఇవాళ రోజల్లా నీతో సరదాగా బయట తిరగాలని ప్లాన్ వేశాను. మార్నింగ్ షోదేనికైనా వెళదామా?"

ఇద్దరూ సోఫాలో పక్కపక్కన కూర్చున్నారు.

"సినిమా కొద్దండీ ఎక్కడికైనా అలా తిరిగొద్దాం!"

"ఆ! ఐడియా తొందరగా తయారవు!" చేత్తో చిటికెవేసి రమణమ్మని తొందరపెట్టాడు.

"ఎక్కడికీ!"

"నీ కెందుకు! ముందు తయారవు! అచ్చు పెళ్ళి కూతుర్లా తయారవాలి!" కన్ను గీటాడు.

"దారిలో పోస్టాఫీసులో మామయ్యగారికి ఎమ్.ఒ. కట్టాలి".

"నువ్వెంత మంచిదానివి రమణా! నాన్నకి డబ్బు కట్టాలని ప్రతి నెల నువ్వే గుర్తు చేస్తావు. నువ్వు నాకే కాదురా మొత్తం మా కుటుంబానికే అదృష్టానివి."

భర్త మాటల్ని వారిస్తూ అందామె "ఊర్కోండి ఎవరైనా నవ్వుతారు. మీ నాన్నగారు మాత్రం మానాన్నగారి లాంటి వారు కాదా! మనం డబ్బు పంపడం

ఈ వారం కథ

**కవితే సమాధానం**

పాశ్చాత్య కవి జాన్ పోప్ అతి విన్నతనం లోనే కవితలు రాసే అలవాటు చేసుకున్నాడు. కాని విన్నతనం లోనే ఇలా కవిత్వపు పిచ్చిలో పడిపోవటం అతని తండ్రికి ఇష్టం లేదు. ఎన్నోసార్లు చెప్పినా విన్నాడు జాన్‌పోప్ ఆ అల వాటు మానుకోలేదు. ఒకరోజు బాగా కోపం వచ్చి గట్టి బెత్తం ఒకటి తీసుకొని కుమారుణ్ణి కొట్టటానికి సిద్ధపడ్డాడు. "రాయటం మాను కుంటావా, లేదా?" అని గద్దించాడు.

అప్పుడు జాన్ పోప్ "తండ్రీ! తండ్రీ! మాపింపు కరుణాను, ముందెప్పుడూ రాయను కవితను!" అని కవితలోనే సమాధానం చెప్పాడు తండ్రికి.

మోరపాకుల

లేటయితే ఆపల్లెటూళ్ళో వాళ్ళెంత ఇబ్బంది పడతారో నాకు తెలుసు".

భార్యని ఒళ్ళోకి లాక్కుని పెదాల మీద ముద్దు పెట్టుకున్నాడు అతను. "రండి తలంటుకి లేట వుతోంది! అప్పుడే 8 గం.లు అయిపోయింది."

ఇద్దరూ తలంటు్లు పోసుకుని భోజనాలు చేసి బయట పడేసరికి పది గంటలు అయింది. అప్సరసలా ఉన్న భార్యని మెచ్చుకోలుగా చూసాడు వెంకటేశ్వర్రావు.

"అనవసరంగా సెలవు పెట్టారు" దారిలో అంది రమణమ్మ.

"పోన్లేవోయ్! ఈ రోజు నా జీవితంలో అతి ముఖ్యమైంది. నీలాంటి అనుకూలవతి భార్యగా దొరి కిన ఈ రోజు నేను ఎంతో ఆనందంగా ప్రతి సంవత్సరం సెలబ్రేట్ చేసుకుంటాను."

"పదండి! పదండి! బస్సుపోతుంది. మిమ్మల్ని నేనూ, నన్ను మీరూ అవకాశం దొరకాలేగాని రోజూ తరబడీ పొగుడుకుంటూనే ఉంటాం!"

సిటీ బస్ ఎక్కి మల్లేశ్వరం ఎయిటీన్త్ క్రాస్‌లో దిగారు ఇద్దరూ. నడుచుకుంటూ 'మయూర బోట్ సెంటర్' చేరారు.

పార్క్‌లో అడుగు పెడుతూనే తనని తాను మర్చిపోయింది రమణమ్మ. బంతి, చేమంతి ఇంకా రకరకాల పూల మొక్కలు అంతా ఒక పద్ధతిగా తీర్చిదిద్దినట్లున్నాయి. మొక్కలే నేపల్లా, ఏనుగుల్లా, గుడిలా, ఒంటెల్లా రకరకాల ఆకారాల్లో కత్తిరించ బడి ఉన్నాయి. ఆ పార్క్ అందం చూస్తూ అలా నిలబడిపోయింది రమణమ్మ. భర్త చేయి పట్టుకుని అంది.

"అబ్బ, ఎంత బాగున్నాయో! పిల్లల్ని ఈ సారి ఇక్కడికి తప్పకుండా తీసుకురావాలండీ!"

"అలాగే!"

"అవునా! మనం బెంగుళూరు వచ్చి ఇన్నాళ్ళ య్యింది కదా! ఒక్కసారీ ఇక్కడికి తీసుకురాలేదేం?"

"నాకూ ఈ మధ్యనే తెలిసిందోయ్! మాకొలీగ్ సుందర్రావు తెలుసుకదా! ఆ మధ్య ఈ వేపు ఏదో పని ఉండి వెళుతుంటే తీసుకొచ్చి చూపించాడు!"

కబుర్లు చెప్పుకుంటూ మెల్లిగా అన్నీ చూసు కుంటూ, బోటు దగ్గరకు చేరుకొన్నారు ఇద్దరూ!

"ఈ చెరువులో రెండు రకాల బోట్లు ఉంటాయి! ఒకటి వాళ్ళు నడుపుతారు. మనిషికి రెండ్రూ పాయలు. ఐదుగురు ఒక్కట్రిప్! ఒకరైనా ఇద్దరైనా పది రూపాయలిస్తే తీసుకువెళతారు. ఇంకో రకం, మనిషి ఒక్కంటికి ఇరవై రూపాయలు టిక్కెట్టు అది పెడల్ బోటు. సైకిల్ తొక్కుతున్నట్టు పెడలింగ్ చేస్తే దాని మీద ఎవరికి వాళ్ళు తిరిగి రావచ్చు. రెండోరకం బోటు ఎక్కుదాం" వివ రాలు చెబుతూ అన్నాడు వెంకటేశ్వర్రావు.

"అమ్మో! నాకు భయం బాబూ! మనకి క్రొత్త కదా! సరిగా పెడలింగ్ చేయడం రాకపోతే మునిగి పోతామేమో!" రమణమ్మమ భయాన్ని వ్యక్త పరి చింది.

"అనవసరంగా భయపడకోయ్! సుందర్రావుతో వచ్చినప్పుడు ఇద్దరం దాని మీద తిరిగాంలే"

ఆ భరోసాతో రమణమ్మ భర్తతో కలిసి పెడల్ బోటు ఎక్కింది. అతను 'పెడలింగ్' చేయడం మొదలు పెట్టాడు. బోటు కదిలింది. ఉద్వేగంతో ఆమె అతని చేయి పట్టుకుంది. కాస్సేపటికి సర్దు కుని అతని చేయి విడిచిపెట్టి ఫ్రీగా కూర్చుంది. తలంటు పోసుకున్న జుత్తు గాలికి ఎగురుతుంటే చేత్తో వెనక్కి తోసుకుంటోంది.

"ఏమండీ! ఎంతో హాయిగా ఉందికదూ! మ ట్టానికు! పడవలో బోయిలో మనిద్దరమే! మాయా బజార్‌లో లాహిరి లాహిరి పాట గుర్తు వస్తోంది!" రమణమ్మ తన్మయంగా అంది.

"బాగు సుమా! రమణా! ఓ పాట పాడవూ!"

భర్తగారియొక్క మెత్తని అభ్యర్థనకి రమణమ్మ తనకి తెలియకుండానే ఎన్నో అభ్యంతరాలూ వదిలిపెట్టి పాట అందుకుంది. సమయం పదిన్నర అయింది. అయినా బెంగుళూరులో ఎండ లేతగా ఉంటుంది. ఎన్నాళ్ళు ఇబ్బంది పెట్టడు. ఆహ్లాదకరంగా ఉన్న ఆ వాతావరణంలో సన్నని వన్నె గొంతుతో శ్రావ్యంగా పాడుతున్న భార్యని మురిపెంగా చూస్తున్నాడు వెంకటేశ్వర్రావు. సమయపాన బోటు ఆపుచేసి, ఇద్దరూ మొక్కలు చూసుకుంటూ ముందుకు వెళ్ళి కూర్చున్నారు.

అందమైన పూల మొక్కలు, గడ్డిగా తలలూ పుష్టా చూసేవాళ్ళకి ఆనందాన్ని కలిగిస్తున్నాయి. సిస్టమేటిక్‌గా పెరిగిన క్రోటన్స్ మొక్కలు అందరూ మెచ్చుకునేలా ఉన్నాయి. అక్కడక్కడా ఒకరిద్దరు మనుషులు!

"రమణా! ఎలా ఉంది?"

చుట్టూ పరిశీలనగా చూస్తున్నదల్లా భర్త మాట లకు చిరునవ్వు నవ్వింది.

"ఎంతో హాయిగా ఉందండీ! ఈ జీవితం ఇలా మీ సమక్షంలో గడిచిపోతే చాలు! ఇంకేం కోరికా లేదు. నాకు!"

"పిచ్చి రమణా! ఈ మామూలు ఎల్.డి.సి. గుమస్తాగాడు నీకు కనీసం ఒక్కటంటే ఒక్క ఖరీదైన ఏదైనా కొనలేడు. నువ్వు చాలా అల్పసంతోషివిరా!

ఉన్నదాంతో నువ్వు దేవతవిరా!"

"చాల్లే ఊరుకోండి! ఎవరైనా నవ్వుతారు. ఇంకే మైనా కబుర్లు చెప్పండి!" రాజ్‌కమల్ చీరకుచ్చెళ్ళు నలగకుండా సరిచేసుకుంటూ అంది రమణమ్మ.

"అబ్బ! ఎండ ఈసారి ఎక్కువయిందోయ్! అలా వెళ్ళి నీడలో కూర్చుందాం పద!"

పార్క్ వెనకాతల ఉన్న వెదురు పొదల వైపు నడిచారు ఇద్దరూ!

"అబ్బ! ఎంత చల్లగా ఉంది ఇక్కడ! హాయిగా ఉంది" ఆమె క్రింద జాగ్రత్తగా చూసుకుని కూర్చుంటూ అంది!

"అది సరేవోయ్! పిల్లలకి ఏం కొందాం చెప్పు!"

"దారిలో ఓ పావుకేజీ స్వీటు ఏదైనా కొందాం! ఈ ఏడు వాల ఖర్చు పెడుతున్నాం మన పెళ్ళి రోజుకి! బెంగగా ఉంది. జీతం ఎలా సర్దాలో" దిగులుగా అంది రమణమ్మ.

"ఇక్కడ బెంగగింగాజావ్వాలై! ఏదైనా ఖుషీగా కబుర్లు చెప్పు!

ఇంత డబ్బు ఖర్చు పెడుతున్నది హాయిగా ఉండటానికి! ఆ బెంగలన్నీ మర్చిపో" భార్యని ఉత్సాహపరుస్తూ అన్నాడు వెంకటేశ్వర్రావు.

ఏదో అనబోతూ అతనివేపు చూసిన రమణమ్మ పక్కున నవ్వింది.

"ఏమిటోయ్! ఏమైంది."

భర్త మాటలకు సమాధానం చెప్పకుండా ఇంకా నవ్వుతూనే ఉంది. కంగారుగా తనని తాను పరిశీ లనగా చూసుకున్నాడతను. ఏం కనపడ్లేదు.

"ఏంటోయ్! చెప్పకుండా నవ్వితే విషయం ఎలా తెలుస్తుందీ?"

".....వచ్చేటప్పుడు.....మీరు....అద్దంలో... మొహం చూసుకున్నారా!" నవ్వాపుకుంటూ అంది ఆమె.

"ఏం! ఏమైందీ!"

"ఏమైందా? వచ్చేటప్పుడు మీరు చేసిన పనికి మీ బుగ్గ మీద కాటుక అంటుకుంది." ఆమాట ముగించే సరికి ఈసారి ఆమె ముఖం సిగ్గుతో ఎర్ర బడింది.

"ఓ! అదా! మరి రాణీగారి అందం మతిపోగొ డుతుంటే ఏం చేయాలి?" బుగ్గమీద రుమాలుతో తుడుచుకుంటూ అన్నాడు" పోయిందా?"

"ఊహూ! నేను తుడుస్తానుండండి!" అతని చేతిలో రుమాలు తీసుకుని బుగ్గమీదతుడుస్తోంది.

ఇంతలో..తక్కువని లాఠీతో కింద కొట్టిన శబ్దానికి ఇద్దరూ ఒక్కసారి ఉలిక్కిపడి చూసారు. పటుక్కున ఒకరి కొకరు దూరం జరిగారు.

ఖాకీ డ్రస్! చేతిలో లాఠీ! పదరు ఆకారాన్ని పోలీసుగా గుర్తించే సరికి ఇద్దరూ అనంకల్పితంగా లేచి నిలబడ్డారు.

"ఫేమిలీయా?"

ఆ ఆకారం ఏమంటున్నాడో ఒక్క క్షణం అర్థం అవలేదు ఇద్దరికీ!

లాఠీ క్రింద మళ్ళీ ఒకసారి కొట్టి మళ్ళీ అడిగాడు.

"ఫేమిలీయా?"

"అవును!" అన్నాడు వెంకటేశ్వరరావు తేరుకుని.

"ఇల్లాయాకి? నిమ్మమనెల్లి? (ఇక్కడెందుకున్నారు? మీ ఇల్లెక్కడ?) అతను 'కన్నడ'లో అడుగుతున్నాడు. వెంకటేశ్వరరావు దంపతులకి కన్నడ అర్థం అవుతుంది. కాని మాట్లాడలేరు. బెంగుళూరులో చాలామంది తెలుగువాళ్ళు ఉంటారు. కన్నడిగులకి తెలుగు బాగా అర్థం అవుతుంది. అందేత అక్కడ కన్నడం రాకపోయినా మెయిన్‌టెయిన్ చేసేయొచ్చు!

"మా ఇల్లు పీవ్వా దగ్గర!" అన్నాడు వెంకటేశ్వరరావు ఇంగ్లీషులో.

"ఇల్లియాకి? నిమ్మ అడ్రసు కొడు!" (ఇక్కడెందుకున్నారు! నీ అడ్రసు ఇయ్యి.) పోలీసు గట్టిగా అడిగాడు.

"నా అడ్రసు ఎందుకు? మేం ఏం చేశాం?" వెంకటేశ్వరరావు కోపంగా అడిగాడు.

"ఫేమిలీయా? నిజహేళు! (ఫేమిలీయేనా! నిజం చెప్పు)

ఇంక రమణమ్మ ఆగలేకపోయింది. కోపం, దుఃఖం ఒక్కసారి ఆమెని చుట్టుముట్టాయి.

"ఇదిగో చూస్కోండి మంగళ సూత్రాలు!" జాకెట్‌లోంచి మంగళ సూత్రాలు తీసి చూపిస్తూ అంది. పోలీసుకి ఇంకా నమ్మకం కుదరలేదు. పైనుంచి క్రింద దాకా ఆమెను పరిశీలనగా చూస్తున్నాడు. రమణమ్మకు ఒళ్ళు చచ్చిపోయినట్టుగా వుంది.

"కాలికి ఏనా ఇల్ల?" (కాళ్ళకి ఏమీ లేవేం?) పోలీసు మళ్ళీ ప్రశ్నించాడు.

ఆ ప్రశ్నతో రమణమ్మ కాళ్ళవేపు చూసుకుంది. ఆమె మధ్యతరగతి ఇల్లాలు. ఈ కరవు రోజుల్లో బెంగుళూరులో పనిమనిషిని భరించడం చాలా కష్టం. అందుకని పని అంతా ఒక్కతే చేసుకుంటుంది. రోజులో ఎక్కువ భాగం నీళ్ళలో వుండడం వల్ల కాళ్ళవేపు మధ్య పాసిపోయి సలుపు పెడుతుంటే, వెంకటేశ్వరరావు పోరగా పోరగా రెండు రోజులైె ఆమె మట్లు తీసేసింది.

"కాలికి ఇన్‌ఫెక్షన్. అందుకని పెట్టుకోలేదు" తలవంచుకుని మెల్లిగా చెప్పింది.

ఏమనుకున్నాడో ఏమో!

"ఇల్లి బేడ! అల్లికూతుకొళ్ళి (ఇక్కడ వద్దు. అక్కడ కూర్చోండి) అన్నాడు పోలీసు ఎండగా వున్న పార్కువేపు చూపిస్తూ.

వెంకటేశ్వరరావు కోపంగా ఏదో అనబోయాడు. రమణమ్మ గబుక్కున అతని చెయ్యి పట్టుకుంది. అతనికి అర్థం అయింది. "సరే పద! అన్నాడు అటు కేసి నడుస్తూ."

మెల్లిగా నడుచుకుంటూ వచ్చి ఎండగా వున్న పార్కులో కూర్చున్నారు.

రమణమ్మ మోకాళ్ళలో తలదూర్చుకుంది. ఎగిసిపడే ఆమె శరీరం చెబుతోంది ఆమె ఏడుస్తోందని.

### అప్పుడన్లేరు...

టీ.వీ.లో 'జాబులూ-జవాబులూ' కార్యక్రమం నడుస్తోంది.

"సోమవారం ఏడు గంటలకు మీరు ప్రసారం చేసిన 'ప్రేమాయణం' అనే నాటిక పరమ ఘోరంగా, కృత్రిమంగా, అసహ్యంగా వుందంటున్నారు గుంటూరు నుంచి గుర్నాథం అనే ప్రేక్షకుడు..."

"చూడండి గుర్నాథంగారూ! మీరు సోమవారం నాటి నాటిక ఘోరంగా, అసహ్యంగా వుందంటున్నారు గదా! వచ్చే సోమవారం, ఆ పై వచ్చే సోమవారం అదే సమయంలో మేము ప్రసారం చేయనున్న నాటికలు గూడా చూసి, అప్పుడు ప్రసారం చేసిన నాటికపై మీరు అదే అభిప్రాయం చెబితే బావుండేది. అప్పుడలా అన్లేరని మా నమ్మకం" అని నవ్వు!

"ప్లీజ్ రవణా! ఊరుకో!" వెంకటేశ్వరరావు అనునయంగా అన్నాడు.

ఓ పది నిమిషాలకిగాని తెప్పరిల్ల లేదామె. ముఖం రుమాలుతో తుడుచుకుంది. అంత క్రితం వరకూ నవ్వుతూ, తుళ్ళుతూ వున్న ఆ అందమైన ముఖం దుఃఖంతో, అవమానంతో ఎర్రబడింది.

"ఛీ ఛీ! ఇంత చిన్నదానికి ఏడుస్తారా చిన్నపిల్లలా! నువ్వు మరీ సెన్సిటివ్‌వోయ్! ఇప్పుడు ఏం జరిగిందని అసలు! ఊ!" అన్నాడు వెంకటేశ్వరరావు ఓదార్పుగా.

"మంగళ సూత్రాలు భర్తకు తప్ప పరాయి మొగాళ్ళ కళ్ళ పడకూడదట. మా అమ్మమ్మ చెప్పింది. అలాంటిది......" ఆమె బాధగా అంది ఆ మాటలంటున్నప్పుడు. ఆమె గొంతురుద్ధమయి ఆ వాక్యం పూర్తి చేయలేకపోయింది.

"అదిగో మళ్ళీ! అసలు తప్పంతా మనదేనోయ్! మనిద్దరం భార్యాభర్తల్లా ఉన్నామా అని అసలు?" అన్నాడు వెంకటేశ్వరరావు సీరియస్‌గా.

అంత దుఃఖంలోనూ తెల్లబోయింది రమణమ్మ.

"ఏం! ఏమైంది?"

"భార్యా భర్తలంటే పక్కవాళ్ళ గురించో, పిల్లల గురించో, చీరల గురించో, అత్తమామల గురించో ఏదో ఒక విషయం గురించి బయటకి వచ్చినా గానీ వాదించుకోకుండా వుండలేరు. ఇద్దరిలో ఎవరిదో ఒకరి ముఖం చిన్నబోకుండా వుండదు. వాళ్ళు భార్యాభర్తలు కారని ఎవరికీ అనుమానం రాదు. మనం అలాలేం కదా! ప్రేయసీ ప్రియుల్లా ఇద్దరం ప్రేమగా తెగ మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ వుంటే ఫూల్‌ఫెలో! ఆ రక్షక భటుడికి అనుమానం వచ్చుంటుంది మనం ఇంకో బాపతని."

"రక్షక భటుడు కాదు. భక్షక భటుడు."

"అంతే కాదోయ్! సదరు శాల్తీ స్వానుభవంతో భార్యతో ఎప్పుడూ సరదాగా మాట్లాడి వుండదు. బహుశ ఆవిడ గయ్యాళి కాబోలు. భర్తను కాల్చుకుతింటూ వుండి వుండాలి. అందుకే భార్య అయితే నీకులా వుండదు - అన్న స్థిరమైన అభిప్రాయం గురుడి మైండ్‌లో వుండి వుండాలి."

అతని పరిహాసానికి ఆ మూడ్‌లో కూడా ఆమెకి నవ్వు వచ్చింది. ఆమె నవ్వు చూసి "హమ్మయ్య" అని నిట్టూర్చాడు వెంకటేశ్వరరావు.

"ఇంటికి పోదాం!"

"అదేంటి రవణా! ఏదైనా హోటలుకి వెళ్ళి స్వీటు తిందాం పద!" లేస్తూ అన్నాడు అతను.

అతని చేయి అందిపుచ్చుకుని నిలబడుతూ అంది ఆమె.

"వద్దండి! ఇప్పటికి అయింది చాలు. ఇంటికే పోదాం!"

"అది కాదు రవణా..." ఏదో అనబోయాడు.

రమణమ్మ మాట్లాడకుండా నడవసాగింది.

పార్కు దాటి బయటకు వచ్చారు ఇద్దరూ! కొంతదూరం నడిచాక అంది రమణమ్మ.

"మనం ఏ పొరపాటూ చేయలేదు. ఎవరినీ బాధ పెట్టలేదు. మనకున్న దానితో తృప్తిగా, హాయిగా గడపాలని చూస్తే ఎందుకిలా జరిగింది! నాకు అస్సలు అర్థం అవడంలేదు! మన ఆనందం ఎందుకిలా తగలెయ్యాలి వాడు?"

వెంకటేశ్వరరావు ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని మృదువుగా నొక్కాడు.

"నీకు ఆ పోలీసు మీద చాలా కోపముంది కదూ?"

"మీకు లేదా?"

"వాళ్ళు లేకపోతే మనమిలా రోడ్లు మీద ఫ్రీగా నడవగలమా?" అన్నాడు.

తెల్లబోయింది రమణమ్మ. ఒక్క క్షణం అక్కడే నిలబడిపోయింది. అతని చేతిని మృదువుగా విడిపించుకుంది. వెంకటేశ్వరరావు అన్నాడు.

"అవును రవణా! ఈ లోకంలో ఎన్నిరకాల ఘోరాలు జరగడం లేదూ! నేరస్థులని పట్టుకునే వాళ్ళూ, శిక్షించే వాళ్ళంటూ లేకపోతే అల్లకల్లోలమయిపోదూ! దొంగతనాలూ, హత్యలూ, మానభంగాలూ ఒకటేమిటి? మనలాంటి బక్కప్రాణులు బ్రతకగలమా? మనం సుఖంగా వుండడానికే ఈ పోలీసులు గట్రాను!"

రమణమ్మ అతని మాటలని ఒప్పుకోనట్టు తలూపింది.

"మీరేవో పెద్ద కబుర్లు చెబుతున్నారు. నాకేం తెలీడం లేదు. ఈ వేళ జరిగిన అవమానాన్నీ... దుఃఖాన్నీ..." ఉక్రోషంతో ఆమె గొంతు రుద్ధమయింది. ఒక్క క్షణం తనని తాను సంభాళించుకుని తిరిగి అంది.

"వీళ్ళంతా మనం సుఖంగా వుండడానికే అయితే నాకింత బాధ ఎందుక్కలిగింది?"

వెంకటేశ్వరరావుకి ఆమె బాధ అర్థమయినంతగా ప్రశ్న అర్థం కాలేదు.

ఇంతలో బస్సు వచ్చింది. వాళ్ళిద్దరూ బస్సు ఎక్కారు. బస్సు భారంగా కదిలింది.